సాక్షి
వికారాబాద్
బుధవారం । 18 । జూన్ । 2025



నాణ్యత లేని సన్నబియ్యం

సర్కారు బడులకు నాణ్యతలేని సన్న బియ్యం సరఫరా అవుతుండటంతో నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. 10లో▸



మొక్కలు నాటుదాం..

మొక్కలు నాటి భవిష్యత్‌ను కాపాడుకుందామని మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి అన్నారు. 10లో▸



పాఠశాలలు తెరుచుకోవా?

దుద్యాల్ మండలం సోమ్లనాయక్ తండా, వాల్యా నాయక్ తండా, రోటిబండ తండాల్లో పాఠశాలలు తెరుచుకోలేదు. 11లో▸

రైతుకు భరోసా

అన్నదాతల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం

- ముందుగా మూడు ఎకరాల వరకు..
- జిల్లాలో మొత్తం రైతులు 3,18,447మంది
- జమ చేయాల్సింది రూ.384 కోట్లు
- ఇప్పటి వరకు ట్రెజరీకి చేరిన నగదు రూ.216 కోట్లు



వికారాబాద్: రైతుల ఎదురుచూపులు ఫలించాయి.. ఎట్టకేలకు రైతు భరోసా డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ప్రభుత్వం గత ఫిబ్రవరిలో మొదటి విడత యాసంగి డబ్బు జమ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో నాలుగు ఎకరాల వరకే పథకం అమలు చేశారు. అంతకంటే ఎక్కువ పొలం ఉన్నవారి ఖాతాల్లో డబ్బు వేయలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంట పెట్టుబడి సాయం జమవుతోంది. ఇప్పుడు కూడా నాలుగు ఎకరాల పొలం ఉన్న రైతులందరికీ పంట పెట్టుబడి సాయం ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన డబ్బు ట్రెజరీ చేరగా సోమవారం రాత్రి నుంచి మూడు ఎకరాలు ఉన్న రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ఎకరాకు రూ.6 వేల చొప్పున..

జిల్లాలో మొత్తం 539 రెవెన్యూ గ్రామాలు.. 20 మండలాలు.. 3,18,447 మంది రైతులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఏటా ఎకరాకు రూ.12వేల చొప్పున పంట పెట్టుబడి సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎకరాకు రూ.6వేల చొప్పున జమ చేస్తున్నారు. జిల్లాలో 6,40,655 ఎకరాల సాగు భూమి ఉండగా రూ. 384,39,32,887 జమ చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. 2,71,785 మంది రైతులకు సంబంధించి రూ.358,17,08,533 ఇచ్చేందుకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలోని 2,30,844 మంది రైతులకు సంబంధించి రూ.216,60,10,315 ట్రెజరీలో జమ చేశారు.

60శాతం రైతుల ఖాతాల్లో..

వ్యవసాయ శాఖ దగ్గర ఉన గణాంకాల ప్రకారం మూడు ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. ఈ లెక్కన దాదాపు 60 శాతం మేర ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. జిల్లాలో రైతు భరోసాకు అర్హులైన అన్నదాతలు 3.18 లక్షల మంది ఉండగా 6.40 లక్షల ఎకరాలకు పథకం అమలు చేయాల్సి ఉంది. ముందుగా మూడు ఎకరాల వరకు పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో ఎకరం భూమి ఉన్న రైతులు 70,219 మంది, రెండు ఎకరాలు ఉన్న రైతులు 88,340 మంది, మూడు ఎకరాల భూమి ఉన్న రైతులు 2,05,361 మంది ఉండగా వారి ఖాతాల్లో రూ.163,55,18,580 జమ చేశారు.

అందరికీ అమలు చేయాలి

గత ప్రభుత్వం రైతు బంధు పేరిట పథకాన్ని అమలు చేయగా ప్రస్తుత సర్కారు రైతు భరోసా పేరున అమలు చేస్తోంది. అయితే ఎకరం నుంచి మూడు ఎకరాల్లోపు వారికి డబ్బు జమ చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉన్నందున ఈ నెల చివరిలో అన్నదాతలందరికీ రైతుభరోసా అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సాగు పనులు ప్రారంభించాల్సి ఉన్నందున సత్వరం పంట పెట్టుబడి సాయం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా అందరి ఖాతాల్లో నగదు జమ చేయాలని వారు విన్నవిస్తున్నారు.



మోమిన్‌పేట రైతు వేదికలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

- రైతు వేదికల్లో ఏఈఓలు అందుబాటులో ఉండాలి
- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

మోమిన్‌పేట: విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించమని, వ్యవసాయాధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఏఓ మోహన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికను ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో ఏఈఓలు అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పంటల సాగుపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ఇక్క డికి వస్తుంటారని, అధికారులు అందుబాటులో లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. అప్పటికే చాలా మంది అన్నదాతలు రైతు భరోసా కోసం దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చారు. కొంత మంది ఏఈఓలకు ఫోన్ చేసినా వారు అందుబాటులోకి రాలేదు. అర గంట తర్వాత ఒక్కొక్కరుగా రైతు వేదిక వద్దకు వచ్చారు. ఏఈఓలు ఆలస్యంగా రావడంపై డీఏఓ మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఆలస్యంగా వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమయానికి రైతు వేదికలో ఉండాలని ఆదేశించారు. రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు చాలా మంది ఇక్కడికి వస్తుంటారని అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. వానాకాలం సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ జయశంకర్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలి

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్



తాండూరు ఆర్టీసీ డిపో సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు టౌన్: విద్యార్థుల నుంచి ఎలాంటి రుసుం తీసుకోకుండా ఉచితంగా బస్‌పాస్‌లు ఇవ్వాలని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు తాండూరు ఆర్టీసీ డిపో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను 20 శాతం మేర పెంచడం సమంజసం కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి సమీపంలోని పట్టణ ప్రాంతాలకు వచ్చి చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులపై బస్‌పాస్ చార్జీల పెంపు తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం చొరవ తీసుకుని విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి శ్రీధర్, నాయకులు ప్రకాష్, రాజు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



విద్యార్థినులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రాంరెడ్డి మంగళవారం సూచించారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందన్నారు. జూన్ 16 నుంచి 19వ తేదీ వరకు మండల స్థాయి ఎంపిక, జూన్ 23 నుంచి 26వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఎంపిక, జులై 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపిక ఉంటుందన్నారు. మూడు పాఠశాలల్లో బాలికలకు 60 సీట్లు, బాలురకు 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తాగునీరు, ఉచితంగా పుస్తకాలు, దుస్తులు ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన కోరారు.

సకాలంలో బిల్లులు చెల్లిస్తాం

హౌసింగ్ డీఈఈ ఖలీమొద్దీన్



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటే త్వరగా బిల్లులు అందజేస్తామని హౌసింగ్ డీఈఈ ఖలీమొద్దీన్ అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు నిర్మించుకునే వారికి నాలుగు దశల్లో బిల్లులు చెల్లిస్తామన్నారు. పునాది పనులు పూర్తి కాగానే మొదటి బిల్లు రూ.లక్ష, గోడలు కట్టిన తర్వాత మరో రూ.లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో రూ.లక్ష అందజేస్తామని తెలిపారు. అధికారులు సూచించిన ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రహీం, పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతుల్లో ఆనందం

- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన మన జిల్లా రైతాంగానికి ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. పంట పెట్టుబడి సాయం క్రింద జిల్లాలోని 3,18,447మంది రైతుల ఖాతాల్లో రూ.384.4 కోట్లు జమ చేస్తోందన్నారు. రైతుల బ్యాంక్ ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేశారన్నారు. ఈ వివరాలకు అనుగుణంగా మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలోని 2,05,361 మంది రైతుల ఖాతాలలో రూ.163.6 కోట్లు జమ అయ్యాయని వివరించారు. మూడు ఎకరాలలోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసినట్లు తెలిపారు. మిగతా రైతుల ఖాతాల్లో కూడా నదులు జమ చేస్తామని పేర్కొన్నారు.

సదరం సర్టిఫికెట్లు అందజేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- రెండు నెలల్లో ప్రక్రియ పూర్తి కావాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: సదరం క్యాంపుల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని, ఈ ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవా రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సదరం/యూడీఐడీ శిబిరాల నిర్వహణపై డీఆర్డీఓ, వైద్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. జిల్లాలోని దివ్యాంగులకు సదరం, యూడీఐడీ శిబిరాల ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజే యాలన్నారు. 689 మంది పరీక్షలు పూర్తి చేసుకొని పత్రాల కోసం ఎదురు చూస్తున్నారని ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అందజేయాలని సూచించారు. క్యాంపులకు వచ్చే ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ధ్రువీకర ణ పత్రాలను అందజేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, కొడంగల్, వికారాబాద్ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు పద్మ, మ ల్లికార్జున్, డీపీఎం నర్సింలు, ఏపీఎం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల దందాను అడ్డుకోండి

ఎంఈఓను కోరిన బీసీ జేఏసీ నాయకులు



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూరు టౌన్: నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరలను నిర్ణయించడంతో పాటు, నేరుగా వారే విక్రయిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖాధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల పుస్తకాల విక్రయ దందాను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



పగిడియాల పాఠశాలలో కుమారుడిని చేర్పిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్

యాలాల: సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పగిడియాల ఉన్నత పాఠశాల జీహెచ్ఎం క్రిష్ణయ్య అన్నారు. మంగళవారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిట్ల శ్రీనివాస్ తన కుమారుడు పిట్ల ప్రణయ్‌కుమార్‌ను ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పిట్ల శ్రీనివాస్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పల్లె రవి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

- గడిచిన ఏడాదిలో 30వేల కిలోల గంజాయి సీజ్ చేశాం
- రాష్ట్రంలో గంజాయిలేదు.. పక్క రాష్ట్రాల నుంచి సరఫరా అవుతోంది
- సైబర్ నేరాల అదుపులో మనమే ముందున్నాం
- రూ.185 కోట్లు రికవరీ చేశాం
- డీజీపీ జితేందర్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

వికారాబాద్: డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా తెలంగాణ పోలీసులు పని చేస్తున్నారు.. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం.. అని డీజీపీ జితేందర్ అన్నారు. మంగళవారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, ప్రమాదాల నివారణ, ఇసుక అక్రమ రవాణా, మతపరమైన ఘర్షణలు, నివారణ చర్యలు తదితర వాటిపై సమీక్ష చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో 30వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గంజాయి లేదని.. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ మీదుగా సరఫరా అవుతోందన్నారు. దీన్ని కూడా సమర్థవంతంగా అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాల అదుపులో దేశంలోనే రాష్ట్రం ముందుందని.. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే ధ్రువీకరించిందన్నారు. దీంతో మన పోలీసులపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. సైబర్ నేరాల కట్టడికి రెండు వందల మందికిపైగా పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. గడిచిన ఏడాది కాలంలో సైబర్ మోసాల ద్వారా కోల్పోయిన రూ.185 కోట్లు రాబట్టామని, ఈ సొమ్మును బాధితులకు తిరిగి అప్పగించామన్నారు. సైబర్ నేరాల అదుపులో మన పోలీసులు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారని పేర్కొన్నారు. నకిలీ విత్తనాల కట్టడికి ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డయల్ 100 ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్నారు. ఇటీవల ఓ సింగర్ తోపాటు ఇతరులపై కేసు నమోదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం పోలీసులకు పలు సూచనలు చేశారు. ఇసుక మాఫియా, జూదం, మట్కా, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అట్రాసిటీ కేసుల విషయంలో పకడ్బందీగా దర్యాప్తు చేసి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐజీ సత్యనారాయణ, డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ ఎస్పీ హన్మంతరావ్, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ, వీరేశ్, సీఐలు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన కలెక్టర్

అనంతగిరి: వికారాబాద్ పర్యటనకు వచ్చిన డీజీపీ డాక్టర్ జితేందర్‌ను కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్వాగతం పలికారు. ఆయన వెంట ఎస్పీ నారాయణరెడ్డి ఉన్నారు.

దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోంది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

అనంతగిరి: ప్రధాని మోదీ పదకొండేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్‌లో పార్టీ ఆధ్వర్యంలో పేదరికం లేని దేశంగా అభివృద్ధి చెందాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి రెండు సమానంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నేడు యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోందన్నారు. మోదీ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో సంఘటన సంరచనా ప్రభారీ పడాకుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

సమస్యల పరిష్కారానికే సదస్సులు



హకీంపేట్ రెవెన్యూ సదస్సులో అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- మండలంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు

దుద్యాల్: భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని హకీంపేట్‌లో నిర్వహించిన భూ భారతి సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు భూ సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కొత్త చట్టాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన వస్తోందని పేర్కొన్నారు. హకీంపేట్ నుంచి తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. మండల వ్యాప్తంగా 310 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ వీరేశ్ బాబు, సిబ్బంది పక్కిరప్ప, ఊషప్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని రాకమకొండ వేంకటేశ్వర స్వామిని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త రాకం యాదయ్య ఆయన్ను సన్మానించారు.

సద్వినియోగం చేసుకోవాలి

పరిగి: గ్రామాల్లో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని గోవిందపూర్‌లో నిర్వహించిన సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్యాణ మండపంలో షార్ట్ సర్క్యూట్

రూ.15 లక్షల ఆస్తి నష్టం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

తాండూరు టౌన్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ కల్యాణ మండలంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఫైర్ సేఫ్టీ అధికారి జలంధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగినట్టు సమాచారం అందడంతో సిబ్బంది కలిసి ఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చాం. ప్రమాద కారణంగా ఫర్నిచర్‌తో పాటు పలు వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఘటనా సమయంలో హాల్‌లో ఎటువంటి కార్యక్రమం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ.15లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు వీరశైవ సమాజ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎన్నికల హామీలు అమలు చేయండి

కిసాన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్



చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి కిసాన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. రుణమాఫీ పూర్తిగా కాక రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. రైతు భరోసా కాలయాపన చేయొద్దని విన్నవించారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న రైతు భరోసాను రైతుల ఖాతాల్లో ఒకేసారి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి



జైపాల్(ఫైల్)

దౌల్తాబాద్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీటమునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని తిర్మలాపూర్ మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నబాయి జైపాల్(32) భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల కిత్రం స్వగ్రామానికి వచ్చిన జైపాల్ ఆదివారం గ్రామంలోని జానకి చెరువులో చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం చెరువుగట్టుపై బట్టలు చూసిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చెరువులోని ఓ గుంటలో ఉన్న శవాన్ని వెలికి తీశారు. భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్ల సంతానం.

ఫోన్ ట్యాపింగ్‌తో టార్గెట్ చేశారు

- వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తన ఫోన్ ట్యాపింగ్‌చేసి, టార్గెట్ చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్‌తో తన వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఓడించాలనే ఆలోచనతో తాను మాట్లాడిన మాటలను ట్యాపింగ్ చేశారని, తనతో మాట్లాడిన నాయకులు, కార్యకర్తల సంభాషణలను బహిర్గతం చేసి ఏం సాధించారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో స్థానిక నాయకుల పాత్ర ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తనకు టికెట్ రాదని ముందుగానే ప్రచారం చేశారంటే ఫోన్ ట్యాపింగ్ ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. చివరికి తన భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడిన మాటలను కూడా ట్యాపింగ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, మహేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడికి.. నాణ్యత లేని సన్న బియ్యం



పురుగులున్న సన్నబియ్యం



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

- టేకులగడ్డ తండాలో మధ్యాహ్న భోజన పరిశీలన
- నాణ్యతాలోపంపై ఎంఈఓకు వివరించిన గ్రామ పరిపాలన అధికారి

బొంరాస్‌పేట: రాష్ట్రమంతా తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం సర్కార్ బడులకు మాత్రం నాణ్యతలేని బియ్యం పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వచ్చేది అతిసారకాలం.. ఆహారత పదార్థులు, పాత్రలపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన తరుణంలో నాసిరకం బియ్యం సరఫరా అవుతోందని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. భోజనం చేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ఉమ్మడి మండలంలో సన్నబియ్యం సరఫరా ఇలా	
పాఠశాలలు	77
విద్యార్థుల సంఖ్య	2,783
నెలవారీగా సరఫరా	76.50 (క్వింటాళ్లు)
1-5వ విద్యార్థులకు	100 గ్రాములు
6-9వ విద్యార్థులకు	150 గ్రాములు

అల్పాహారానికి ట్రస్టు సహకారం

హరేరామ హరేకృష్ణ చారిటబుల్ ట్రస్టు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నిత్యం ఉచితంగా అల్పాహారం సరఫరా చేస్తున్నారు. గతేడాది నుంచి ఇడ్లీ, బోండా, వడ, ఉప్మా, పొంగలి, పులిహోర అందజేస్తున్నారు.

ఆకస్మిక తనిఖీ

మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో ఎంఈఓ, ఎంపీడీఓ, తహసీల్దారు, ఏఓ తదితరులు ఉంటున్నారు. పాఠశాల స్థాయిలో హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, ఏఏపీసీ చైర్మన్, అంగన్‌వాడీ కార్యకర్తలతో కూడిన కమిటీలున్నాయి. వారి పర్యవేక్షణ లోపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మండల పరిధిలోని టేకులగడ్డతండా పాఠశాలలో గ్రామ పరిపాలన అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు. బియ్యం పరిశీలించిన వెంటనే ఆయన ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. వంటపాత్రలు, గదుల శుభ్రతను తెలియజేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

పురుగులు వస్తున్నాయి



పాఠశాలలో 2018 నుంచి మధ్యాహ్న పథకంలో ఏజెన్సీ మహిళగా పనిచేస్తున్నాను. సన్నబియ్యం సరఫరాతో నాణ్యత ఉంటుందని ఊహించుకుంటే పురుగుల బియ్యం వస్తున్నాయి. నాణ్యమైన సన్నబియ్యాన్ని సరఫరా చేయాలి.

– సోమ్లీబాయి, ఏజెన్సీ మహిళ, దరికిందితండా

చర్యలు తీసుకుంటాం



నాణ్యత లేని బియ్యం నిల్వపై హెచ్‌ఎంల నుంచి వివరాలు తీసుకున్నాం. పౌష్టిక ఆహారం, పరిశుభ్రతపై ఇటీవల పాఠశాల ఏజెన్సీ మహిళలకు, హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చాం. కమిటీల పర్యవేక్షణకు ఆదేశిస్తాం. ఫుడ్‌పాయిజన్ సంఘటనలు ఎక్కడున్నా అందరిపై చర్యలు తీసుకుంటాం.

–హరిలాల్, ఎంఈఓ, బొంరాస్‌పేట

ఇసుక మాఫియాను కట్టడి చేయండి

బీజేపీ నాయకుల వినతి



సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: కాగ్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు బీజేపీ నాయకులు తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతి లేకుండా కాగ్నా నది నుంచి భారీ ఎత్తున ఇసుక తరలిస్తున్నారని చెప్పారు. అడ్డుకున్నవారిపై ఇసుక మాఫియా సభ్యులు దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. సహజసంపదను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణాధ్యక్షుడు మల్లేశం మాజీ కౌన్సిలర్ లలిత, కృష్ణ, రాజు, సంగమేశ్వర్, ప్రకాశ్, కిరణ్, సతీశ్, బాబు తదితరులు ఉన్నారు.

దైవ దర్శనానికి లిఫ్ట్ అడిగి అనంతలోకాలకు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కొడంగల్: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరిన ఓ వ్యక్తి ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి కొడంగల్ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన శివకుమార్ చారి(26) కోస్గి బయలుదేరాడు. అక్కడి తన స్నేహితులతో కలిసి శ్రీశైలం వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. పరిగి వరకు బస్సులో వచ్చిన శివకుమార్ అక్కడ నుంచి కొడంగల్‌కు రాత్రి వేళ బస్సులు లేకపోవడంతో ఓ కారును లిఫ్ట్ అడిగి బయలుదేరాడు. కొడంగల్ శివారుకు చేరుకోగానే కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ముందు భాగంలో కూర్చున్న శివకుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. కారును నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడగా.. వెనుక సీట్లో కూర్చున్న మరో వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృతజ్ఞతలు



వేం నరేందర్‌రెడ్డిని కలిసిన ప్రసన్న కుమార్ శర్మ

మంచాల: ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పేరూరి ప్రసన్నకుమార్ శర్మ మంగళవారం నగరంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ శర్మ మాట్లాడుతూ.. నూతనంగా నియామకం కావడంతో వేం నరేందర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్టు చెప్పారు. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

మొక్కలు నాటుదాం.. భవిష్యత్‌ను కాపాడుదాం



చెల్లాపూర్‌లో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి

కుల్కచర్ల: మొక్కలు నాటి భవిష్యత్‌ను కాపాడుకుందామని మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెల్లాపూర్‌లో బీజేపీ 11 వసంతాల పాలన విజయవంతంగా కొనసాగుతున్నందున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతికి మొక్కలు ఎలా జీవనాధారమో సనాతన ధర్మాన్ని కాపాడడం, శత్రుదేశాల నుంచి దేశాన్ని రక్షించుకోవడం బీజేపీ పాలనలోనే సాధ్యమన్నారు. మోదీ నాయకత్వంలో భారతదేశం అన్నిరంగాల్లో అభ్యున్నతి సాధిస్తుందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు మరింత శ్రమించి బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, రామకృష్ణ, వెంకటేశ్, మహేశ్, రాంచంద్రయ్య, పి.అంజి, చెన్నయ్య, కృష్ణయ్య, సి.వెంకటయ్య, సి.అంజిలయ్య, బాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనంలో ఉన్నా.. భరోసా సున్నా

- పట్టాభూములు టీజీఐఐసీ పేరిట మార్చి పొట్టకొడుతున్నారు
- నాలుగేళ్లుగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు
- భూములు తీసుకుని రెవెన్యూ సదస్సులు ఎందుకు
- బహిష్కరించిన నానక్‌నగర్, తాడిపర్తి రైతులు

యాచారం: నాలుగైదేళ్లుగా సాగు సాయం అందక ఫార్మాసిటీ బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. భూములు తమ స్వాధీనంలో ఉన్నా రికార్డుల్లో లేక ఇబ్బంది పడుతున్నారు. తాము సాగు చేసుకుంటున్న పట్టాభూముల రికార్డులు తమ పేరిట మార్చి రైతు భరోసా, బ్యాంకు రుణాలు, క్రయ విక్రయాలు చేసుకునేలా సహకరించాలని ప్రాధేయపడినా కనికరించేవారే కరువయ్యారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల నుంచి పది వేల ఎకరాలు సేకరించాలని నిర్ణయించి 7,500 ఎకరాల అసైన్డ్, పట్టా భూములు సేకరించింది.

టీజీఐఐసీ పేరిట 2,200 ఎకరాలు

ఫార్మాసిటీకి భూ సేకరణ సమయంలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు పట్టా భూములు ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో 2,200 ఎకరాలను టీజీఐఐసీ పేరిట మార్చేశారు. రాత్రికి రాత్రే అవార్డులు పాస్ చేసి పరిహారాన్ని స్పెషల్ అథారిటీలో జమ చేశారు. ఆ భూ రికార్డులను నిషేధిత జాబితాలో పెట్టడంతో బీఆర్‌ఎస్ హయాంలోని రైతుబంధు, కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న రైతు భరోసాతో పాటు బ్యాంకు రుణాలు, విరాసత్‌లకు అవకాశం లేకుండా పోయింది. టీజీఐఐసీ పేరిట మార్చిన భూ రికార్డులను రైతుల పేర్లపై మార్చాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికారుల్లో చలనం లేదు.

3,290 మందికి భరోసా బంద్

మండల పరిధిలోని 24 పంచాయతీల్లో 19,493 మంది రైతులు రైతు భరోసాకు అర్హులుండగా 16,053 మందికి మాత్రమే నగదు జమకానుంది. 2,200 ఎకరాల పట్టా భూముల రికార్డులు టీజీఐఐసీ మీద మార్చడంతో బీఆర్‌ఎస్ హయాంలో మూడేళ్ల పాటు, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ హయాంలో రెండు దఫాలుగా రైతు భరోసా నిధులు అందడం లేదు. రుణమాఫీ సైతం కాకపోవడంతో రుణాలు బకాయి పడ్డారు. ఈ దఫా సైతం రైతు భరోసా నిధులు జమ కాకపోవడంతో నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల్లోని రైతులు అధికారులు నిర్వహించిన రెవెన్యూ సదస్సులను బహిష్కరించారు.

భూ రికార్డుల మార్పు సరికాదు



తమ కుటుంబ సభ్యుల పేరిట 30 ఎకరాలకు పైగా పట్టా భూమి ఉంది. ఫార్మాసిటీకి భూములు ఇవ్వడం లేదని టీజీఐఐసీ పేరు మీద మార్చేశారు. తమ అంగీకారం లేకుండానే భూ రికార్డులు మార్చడం సరికాదు. సాగుకు పెట్టుబడి లేక ఇబ్బంది పడుతున్నాం. అందుకే రైతు రెవెన్యూ సదస్సు బహిష్కరించాం.

– ముత్యాల వెంకట్‌రెడ్డి, రైతు, నానక్‌నగర్

రైతులు ఫిర్యాదు చేస్తున్నారు



నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో నిషేధిత జాబితాలో ఉన్న 2 వేల ఎకరాలకు పైగా పట్టా భూములకు రైతు భరోసా నిధులు జమ కావడం లేదని రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తాం.

– రవినాథ్, మండల వ్యవసాయాధికారి

కూరగాయలు పండ్లతోటలు సాగు పెరిగేలా..

ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ దృష్టి

- జిల్లాలో విస్తీర్ణం పెంపే లక్ష్యం
- రాయితీపై విరివిగా డ్రిప్ పరికరాలు
- ఉచితంగా నారు అందజేత
- రైతులు వినియోగించుకోవాలని సూచన



యాచారం మండలం చౌదర్‌పల్లిలో డ్రిప్ పరికరాలతో సాగవుతున్న కూరగాయలు

యాచారం: కూరగాయలు, పండ్లతోటల సాగు విస్తీర్ణం పెంచేలా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ దృష్టి సారించింది. ఆసక్తి కలిగిన రైతులను ప్రోత్సహించడం కోసం రాయితీ అవకాశం కల్పిస్తోంది. మహానగరం చుట్టూ విస్తరించి ఉన్న జిల్లాలో కూరగాయలు, పండ్లతోటల పెంపకాన్ని చేపట్టి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయించి ఆర్థిక ప్రగతి సాధించాలన్నదే సర్కార్ లక్ష్యం. రైతు కమిషన్ ఆధ్వర్యంలో కూరగాయలు, ఆకుకూరల పంటల సాగు పెంపు కోసం యాచారం మండలంలోని చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను పైలెట్ కింద తీసుకుని ప్రోత్సాహం అందిస్తోంది. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, కందుకూరు, షాద్‌నగర్, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని దాదాపు 12 వేల మందికి పైగా రైతులు 30 వేల ఎకరాలకు పైగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం పెంపుపై ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో సౌకర్యాలు కల్పించి సాగు విస్తీర్ణం పెంచేలా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ దృష్టి పెట్టింది.

మొదటగా 390 హెక్టార్లకు డ్రిప్

మొదటి ప్రాధాన్యత కింద జిల్లా వ్యాప్తంగా 390 హెక్టార్లకు గాను రాయితీపై డ్రిప్ పరికరాలు అందించేలా నిర్ణయించింది. కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసే వారిలో అత్యధికంగా ఎస్సీ, బీసీ, జనరల్ రైతులే ఉంటారు. ప్రాధాన్యత కింద వారికి మేలు చేసేలా అధికారులు నిర్ణయించారు. 40 హెక్టార్ల డ్రిప్‌ను ఎస్సీ రైతులకు, 350 హెక్టార్ల డ్రిప్‌ను జనరల్ రైతులకు అందించనున్నారు. కూరగాయల పంటలకైతే రెండు ఎకరాలలోపు, పండ్లతోటలైతే పన్నెండున్నర ఎకరాలలోపు డ్రిప్ అందజేస్తారు. ఎస్సీ రైతులకైతే వంద శాతం (జీఎస్టీ చెల్లించాలి) రాయితీపై.. సన్నకారు, చిన్నకారు రైతులైతే 90 శాతం రాయితీపై అందజేస్తారు.

నాణ్యమైన నారు అందజేత

వానాకాలం సీజన్‌లో రైతులు అత్యధికంగా పలు రకాల కూరగాయల సాగుకు ఆసక్తి చూపుతారు. సరైన అవగాహన లేక స్థానికంగా ప్రైవేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన నర్సరీల్లో నారు కొనుగోలు చేసి దిగుబడి లేక తీవ్రంగా నష్టపోతున్నారు. అలాంటి వారి కోసం నాణ్యమైన నారును అందించనున్నారు. రైతులు తమ వ్యవసాయ భూములకు సంబంధించి పట్టాదారు, పాసుపుస్తకంతో పాటు ఒక ఫొటో, ఆధార్, బ్యాంకు, ఫోన్ నంబర్లతో కూడిన వివరాలు (జిరాక్స్ ప్రతులు) ఆయా డివిజన్లలోని ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ కార్యాలయాల్లో అందజేయాలి. దరఖాస్తు చేసుకున్న వారికి నాణ్యమైన టమాటా, మిర్చి, వంగ కూరగాయల విత్తనాలను, ఎకరాకు 8 వేల మొక్కలను అందిస్తారు.

సీఎంకు విన్నవించాం



సీఎంను కలిసి రైతుల సమస్యలు తెలియజేయడం చాలా సంతోషంగా ఉంది. జిల్లాలోని కూరగాయలు, పండ్లతోటలు సాగు చేసే రైతులకు విరివిగా డ్రిప్, యంత్ర పరికాలు ఇవ్వాలని విన్నవించాం.

– కాశమల్ల రాములు, రైతు, చౌదర్‌పల్లి

సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది 390 హెక్టార్లల్లో కూరగాయలు, పండ్లతోటలకు డ్రిప్ పరికరాలు అందించాలని నిర్ణయించాం. నారు కోసం ఆసక్తి కలిగిన రైతులు నెల రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. – సురేశ్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి విస్తతంగా ప్రచారం చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. పట్టణంలో మంగళవారం నియోజకవర్గ గిరిజన మోర్చా ఇన్‌చార్జి మోహన్‌సింగ్ అధ్యక్షతన గిరిజన నేతల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మూడు పర్యాయాలుగా ప్రధాని మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా..

వ్యక్తి అదృశ్యం



కుమారుడితో మామిడి శివ(ఫైల్)

కేశంపేట: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన మామిడి శివ అలియాస్ సిటీ కేబుల్ శివ(32) ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సెల‌ఫోన్ లొకేషన్ ఆధారంగా వరంగల్‌లో ఉన్నట్లు తెలుసుకున్న కుటంబ సభ్యులు అక్కడికి వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. శివ ఆత్మహత్య చేసుకుంటున్నాంటూ పెట్టిన సెల్ఫీ వీడియో చూస్తూ కుటుంబీకులు, మిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. శివ తల్లి అనుసూయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పు చేస్తే క్షమించండి

'హలో.. హయ్.. ఇన్ని రోజులు నాకు సహకరించిన ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు, శ్రేయోభిలాషులు, స్కూల్, ఇంటర్ ఫ్రెండ్స్, అమ్మ నాన్నలకు ప్రత్యేక ధన్యవాదాలు. అభివృద్ధిలో ఆర్థికంగా అన్ని రకాలుగా సహకరించిన ప్రతాపన్న గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఫ్రెండ్స్ మీఅందరిని వదిలేసి వెళ్లిపోతున్నందుకు బాధగా ఉంది. తెలిసీ తెలియక మీతో అమర్యాదగా మాట్లాడి ఉంటే, తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి'అంటూ సెల్ఫీ వీడియో పోస్టు చేశాడు. ఈ వీడియోను చూస్తూ మిత్రులు, కుటుంబీకులు కన్నీటి పర్యంతం అయ్యారు.